క్లుప్తంగా

ఇళ్ల స్థలాల పరిశీలన



తాళ్లూరు జగనన్న కాలనీలో ఎంపీపీతో మాట్లాడుతున్న డ్వామా పీడీ వెంకటలక్ష్మి

గండేపల్లి: జగనన్న కాలనీల అభివృద్ధికి సహకరించాలని ఎంపీపీ చలగళ్ల దొరబాబు, జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యుడు ఒబిణ్ణి వీరబాబు డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మిని కోరారు. మండలంలోని తాళ్లూరు జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమెను కలిసిన నాయకులు జగనన్న కాలనీలో రహదారులు నిర్మాణానికి, ఇతర అభివృద్ధి పనులకు ఎస్ఆర్ ఈజీఎస్ ద్వారా నిధులు మంజూరు చేయాలని కోరారు. ఆమె వెంట ఎంపీపీ చెల్లూరి రాంబాబు, పాలచర్ల రమేష్, తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

శంఖవరం: జాతీయ రహదారిపై కత్తిపూడి వద్ద శనివారం జరిగిన ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే..పాయకరావు పేట గ్రామానికి చెందిన అనపర్తి అఖిల, సునీత అన్నవరం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. పదో తరగతి పరీక్షల డ్యూటీ నిమిత్తం శనివారం కత్తిపూడి వచ్చి తిరిగి పాయకరావుపేట ద్విచక్ర వాహనంపై వెళ్లుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. బాధితులను స్థానికులు, బంధువులు తుని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మార్కెట్‌లో అగ్నిప్రమాదం



తుని మార్కెట్‌లో అగ్నికి ఆహుతైన తాటాకు పాక

తుని: స్థానిక మహాత్మాగాంధీ మార్కెట్‌లో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో అరటి గెలలను ముగ్గపెట్టే పాక దగ్ధమైంది. సాయంత్రం తాండవనది ఒడ్డున కంపోస్టు చెత్తకు నిప్పుపెట్టగా గాలికి మంటలు తాటాకు పాకకు అంటుకున్నారు. స్థానిక అగ్నిమాపక అధికారి రాజు ఆధ్వర్యంలో సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.20 వేల నష్టం వాటిల్లిందని తాటాకు పాక యాజమాని పడాల నాగేశ్వరరావు తెలిపారు.

ఏఏబీ రాష్ట్ర డైరెక్టర్‌కు పితృవియోగం



మృతుడు లంక రాజారావు (ఫైల్)

కోటనందూరు: మండలంలోని కాకరాపల్లి గ్రామానికి చెందిన వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర డైరెక్టర్ లంక ప్రసాద్ పితృవియోగం పొందారు. ప్రసాద్ తండ్రి లంక రాజారావు(72) మూడు రోజుల క్రితం అనారోగ్యానికి గురి కావడంతో తుని ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నంలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందారు. శనివారం ఉదయం స్వగ్రామం కాకరాపల్లిలో అంత్యక్రియలు పూర్తి చేశారు. ఎంపీపీ లగుడు శ్రీనివాసు, సొసైటీ చైర్మన్ గొర్లి రామచంద్రరావు, లోవదేవస్థానం మాజీ చైర్మన్ లాలం బాబ్జీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు తదితరులు లంక ప్రసాద్‌ను పరామర్శించి ధైర్యం చెప్పారు.

మహిళపై వ్యక్తి దాడి

రౌతులపూడి: స్థానిక దుర్గమ్మ ఆలయం వద్ద ఉంటున్న ఓ మహిళపై అదే గ్రామానికి చెందిన జి.ప్రసాద్ అనే వ్యక్తి శుక్రవారం అర్ధరాత్రి దాడి చేశాడు. శనివారం బాధితురాలు అన్నవరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు విచారణ జరిపి నిందితుడు జి.ప్రసాద్‌ను గ్రామ సచివాలయం వద్ద పెద్దల సమక్షంలో విచారించారు. పూర్తి వివరాలు సేకరించి కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

ఘనంగా సత్యదేవుని ప్రాకారసేవ



రత్నగిరిపై స్వామి, అమ్మవార్లను తిరుచ్చి వాహనం మీద ఊరేగిస్తున్న భక్తులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ప్రాకారసేవ శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 10 గంటలకు సత్యదేవుడు, అనంతలక్ష్మీసత్యవతీదేవి అమ్మవార్లను తిరుచ్చి వాహనం మీద ప్రతిష్ఠించి తూర్పు రాజగోపురం వద్ద గల ఆలయ ప్రాంగణంలోకి ఊరేగింపుగా తీసుకువచ్చారు. అక్కడ ప్రత్యేక పూజలు చేసి వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ ఆలయప్రాకారంలో మూడు సార్లు ఊరేగించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ప్రధానాలయానికి చేర్చారు. ధర్మకర్తల మండలి సభ్యుడు పేరూరి బద్రీ నారాయణ, ఏఈఓ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

కోడి.. ఎండకు అల్లాడి

- అధిక ఉష్ణోగ్రతలకు వాలిపోతున్న బ్రాయిలర్ కోళ్లు
- వడగాడ్పులు నిరోధానికి, చల్లదనానికి ప్రత్యేక చర్యలు
- నియోజకవర్గంలో 60కిపైగా కోళ్లఫారాలు



చేపూరులో కోళ్ల ఫారం షెడ్లపై వేసిన ఎండుగడ్డి



వేసవి ఉష్ణోగ్రతలకు అల్లాడిపోతున్న బ్రాయిలర్ కోళ్లు

తుని రూరల్: అధిక ఉష్ణోగ్రతలకు ఫారాల్లో బ్రాయిలర్ కోళ్లు అల్లాడిపోతున్నాయి. మండుతున్న ఎండలు, వడగాడ్పులతో కోళ్ల పెంపకందారులు ప్రతి సంవత్సరం నష్టాలను చవిచూస్తున్నారు. వేడిని నివారించేందుకు అనేక రకాల ప్రయత్నాలు చేస్తున్నారు. ఎండలతో పొంచిఉన్న ప్రమాదాన్ని కొంతమంది యజమానులు ముందే గ్రహించి వేసవిలో కోళ్ల పెంపకాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నారు. ఖర్చులకు వెనుకాడకుండా మరికొంత మంది చల్లదనాన్నిచ్చే సహాయక చర్యలతో కోళ్ల పెంపకాన్ని కొనసాగిస్తున్నారు. తుని నియోజకవర్గంలోని భారీగా చిన్న, మధ్యతరహ బ్రాయిలర్ కోళ్ల ఫారాలు ఉన్నాయి. ఈ ఫారాల్లో సంవత్సరానికి రెండు విడతల్లో ఐదు లక్షలు నుంచి ఆరు లక్షలు కోళ్లను పెంచుతున్నారు. కొద్దిరోజులుగా తుని పరిసర ప్రాంతాల్లో 35 నుంచి 39 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదువుతున్నాయి.

నియోజకవర్గంలో ఇలా..

నియోజకవర్గంలో తుని, కోటనందూరు, తొండంగి మండలాల్లో 60కి పైగా బ్రాయిలర్ కోళ్ల ఫారాలు ఉన్నాయి. తుని మండలంలో రేఖవానిపాలెం, ఎ.అగ్రహారం, దొండవాక, చేపూరు, హంసవరం, తేటగుంట, డి.పోలవరం, కొలిమేరు, కుమ్మరిలోవ, వి.కొత్తూరు, కోటనందూరు మండలంలో కాకరాపల్లి, కోటనందూరు, కేఈ.చిన్నయ్యపాలెం, అల్లిపూడి, కేఏ అగ్రహారం, తొండంగి మండలంలో శృంగవృక్షం, కృష్ణాపురం, తొండంగి, తదితర గ్రామాల్లో కోళ్ల ఫారాలు ఉన్నాయి.

కోళ్ల సంఖ్యను తగ్గించాం

మా ఫారంలో ఐదారు వేల కోళ్లను పెంచుతాం. వేసవి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండడంతో ఈ సంవత్సరం కోళ్ల పెంపకాన్ని తగ్గించాను. ప్రస్తుతం రెండు వేల కోళ్లనే పెంచుతున్నాం. ఉన్నవాటినే కంటికి రెప్పలా కాపాడుతున్నాం.

– పి.సత్యనారాయణ, ఎ.అగ్రహారం

రక్షణకు పటిష్ట చర్యలు

వేసవి ఉష్ణోగ్రతలను కోళ్ల తట్టుకునేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాం. ఖర్చుకు వెనుకాడకుండా చల్లదనాన్ని ఇచ్చేందుకు షెడ్లపై ఎండిగడ్డి వేసి ఎప్పటికప్పుడు తడుపుతున్నాం. ప్రత్యేకించి కూలీలను ఏర్పాటు చేసి కోళ్ల సంరక్షణకు పటిష్ట చర్యలు తీసుకున్నాం.

– కె.భాస్కరరావు, చేపూరు

కోళ్ల సంరక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు

వేసవిలో బ్రాయిలర్ కోళ్ల సంరక్షణకు యజమానులు వ్యయానికి వెనుకాడకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. చిన్నరైతులు కోళ్లఫారాలు చుట్టూ మొక్కలు పెంచడం, కోళ్లఫారాల్లోకి వేడి గాలులు చొరబడకుండా ప్లాస్టిక్ సంచులతో తయారు చేసిన బరకాలు కట్టడం, కోళ్లఫారాలు షెడ్లపై ఎండిగడ్డిని పరిచి తరుచూ నీళ్లతో తడపడం వంటి పనులు చేస్తున్నారు. కోళ్లకు తాగునీటి కొరత లేకుండా చూస్తున్నారు. అయినప్పటికీ అధిక ఉష్ణోగ్రతలతో బ్రాయిలర్ కోళ్లు తల్లడిల్లిపోతున్నాయి. మరింతగా ఉష్ణోగ్రతలు పెరిగితే కోళ్లు మృత్యువాత పడే ప్రమాదం ఉందని కోళ్లఫారాల యజమానులు ఆందోళన చెందుతున్నారు.

విద్యార్థులకు నిర్దిష్టమైన లక్ష్యం ఉండాలి



వరప్రసాద్‌ను సత్కరిస్తున్న ఆదిత్య చైర్మన్ శేషారెడ్డి

గండేపల్లి: విద్యార్థులు నిర్దిష్టమైన లక్ష్యాన్ని కలిగి ఉండాలని శాంతా బయోటెక్నిక్స్ వ్యవస్థాపక చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కేఐ వరప్రసాద్ సూచించారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య బిజినెస్ స్కూల్‌లో శనివారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్యం వైపు ఎటువంటి తడబాటు లేకుండా ముందుకు సాగాలన్నారు. తల్లిదండ్రుల కలలకు, వారి ఆశయాలకు అనుగుణంగా ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. కృషి, పట్టుదలతో చదివితే దేనినైనా సాధించవచ్చన్నారు. హెపటైటిస్ టీకాను సామాన్యులకు సైతం అందుబాటులోకి తెచ్చిన ఘనత శాస్త్రవేత్త వరప్రసాద్‌కే దక్కుతుందని ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ ఎన్.సతీష్‌రెడ్డి తెలిపారు. అనంతరం ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, ప్రిన్సిపాల్ సంజయ్ కుమార్, ఉపాధ్యాయ సిబ్బంది ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు

ఇంటింటా జగనన్నే మా భవిష్యత్



సిరిపురంలో ఇంటింటా ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



రామచంద్రపురంలో లబ్ధిదారులకు పథకాలు వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలేశ్వరం: నియోజకవర్గ వ్యాప్తంగా శనివారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ శ్రేణులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. మండలంలోని సిరిపురంలో వైఎస్సార్ సీపీ నేత అల్లం ఆదినారాయణ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేశారు. మర్రివీడులో పల్లెల బ్రహ్మాజీరావు ఆధ్వర్యంలోనూ, భద్రవరంలో సర్పంచ్ కూనపురెడ్డి సుబ్బారావు ఆధ్వర్యంలోనూ జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు.

జగనన్నే మా భవిష్యత్

కిర్లంపూడి: రామచంద్రపురంలో సచివాలయ కన్వీనర్లు బండారు రామలక్ష్మి, సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు బండారు వర ప్రసాద్ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రభుత్వానికి మద్దతు తెలిపిన వారి ఇంటి గోడలకు సీఎం జగన్ ఫొటోతో కూడిన స్టిక్కర్లను అతికించారు.

బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి

అన్నవరం: స్థానిక వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో పని చేస్తున్న సిబ్బంది ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విధులు నిర్వహించాలని ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఆదేశించారు. ఆ మేరకు రెండు సమయాల్లో తప్పనిసరిగా బయోమెట్రిక్ హాజరు వేయాలని సూచించారు. 9.30 గంటల నుంచి 9.45 గంటల వరకూ మాత్రమే గ్రేస్ పీరియడ్ గా చూస్తామని ఆ తరువాత కూడా ఆలస్యమేతే తప్పక చర్యలు తీసుకుంటామని ఈఓ హెచ్చరించారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, వ్రతపురోహితులు, నాయీ బ్రాహ్మణులు కూడా వారికి నిర్దేశించిన పని వేళల్లో విధులకు హాజరుకావాలని సూచించారు.

లో ఓల్టేజ్ సమస్యకు చెక్

గండేపల్లి: మండలంలోని ఉప్పలపాడులో లో ఓల్టేజ్ సమస్యకు అధికారులు చెక్ పెట్టినట్టు గ్రామ సర్పంచ్ అడబాల ఆంజనేయులు తెలిపారు. గ్రామంలోని బీసీ, ఓసీ, ఎస్సీ కాలనీల్లో 11 రోజులుగా లోఓల్టేజ్ సమస్య ఉంది. సమస్యను ప్రజలు ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన విద్యుత్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ మేరకు శనివారం విద్యుత్ శాఖ అధికారులు స్పందించి లోఓల్టేజ్ సమస్యకు పరిష్కారం చూపారు.

21న మండల సమావేశం

తుని రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 21న మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎస్.సుబ్రహ్మణ్యశర్మ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19న జరగాల్సిన సమావేశం అనివార్య కారణాలతో 21కి వాయిదా వేశామన్నారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ బొప్పన రాము అధ్యక్షతన జరిగే సమావేశానికి అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

గోకవరం: ప్రభుత్వం నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ సూచించారు. మండల పరిధిలోని గ్రామాల్లోని ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఎంపీడీఓ కేఎస్ఎన్ మూర్తితో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. అలాగే వ్యవసాయశాఖ సిబ్బంది ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు.

మజ్జిగ పంపిణీ

జగ్గంపేట: స్థానిక బాలాజీ జ్యూయలర్స్ ఎదురుగా శనివారం బాటసారులు, వాహనదారులకు మజ్జిగ మజ్జిగ పంపిణీ చేశారు. వాసవి క్లబ్ మెంబర్ బొండా శ్రీరామచంద్రమూర్తి సహకారంతో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ శిబిరాన్ని ఆర్యవైశ్య సేవాసంఘం అధ్యక్షుడు కొత్త కొండబాబు ప్రారంభించారు. వాహనదారులకు ఉదయం నుంచి సాయంత్రం వరకూ మజ్జిగ పంపిణీ చేశారు. వాసవి క్లబ్ మాజీ అధ్యక్షుడు పాట్టి రాజేష్, వి.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



రైతులకు విత్తనాలు అందజేస్తున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

ఏలేశ్వరం: రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏఓ బి.జ్యోతి అధ్యక్షతన శనివారం మండల వ్యవసాయ సలహామండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం రైతులను ఆదుకొనేందుకు పలు పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. ఆర్బీకేల ద్వారా సబ్సిడీపై రైతులకు ఎరువులు, విత్తనాలు అందిస్తోందన్నారు. రైతులు ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఎంపీటీసీ సభ్యుడు ఇజనగిరి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ సలహా మండలి సమావేశం

గోకవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. రైతు భరోసా కేంద్రాల ద్వారా రబీ ధాన్యం కొనుగోలు చేస్తామని, ఇందు కోసం గోనె సంచులు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. పంట పొలాల్లో పోషక విలువలు పెంపొందించేందుకు మట్టి నమూనాల సేకరిస్తున్నట్టు చెప్పారు. పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర వీరబాబు, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, నరాలశెట్టి నర్శయ్య, వ్యవసాయ సలహా మండలి సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన ఫ్లెక్సీ వివాదం



ఏలూరులో ఆందోళనకారులతో చర్చిస్తున్న సీఐ కిషోర్‌బాబు

ప్రత్తిపాడు: మండలంలోని ఏలూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ చిరిగింది. ఫ్లెక్సీని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ యువత రోడ్డెక్కింది. పోలీసులు సముదాయించడంతో వివాదం సద్దుమణిగింది. వివరాల్లోకి వెళితే.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని గ్రామంలోని కొంత మంది యువత ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీని శనివారం గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ యువకులు రోడ్డుపై బైఠాయించి, నిరసన చేపట్టారు. విషయం తెలుసుకున్న ప్రత్తిపాడు సీఐ కె.కిషోర్‌బాబు, ఎస్సై ఎం. పవన్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఆందోళనకారులతో చర్చించారు. ఫ్లెక్సీ ధ్వంసంపై విచారణ జరిపి నిందితులపై చర్యలు తీసుకుంటామని సీఐ కిషోర్‌బాబు హామీ ఇవ్వడంతో యువకులు ఆందోళన విరమించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలేశ్వరం: విద్యుత్ తీగలపై ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ సూర్యనారాయణ శనివారం తెలిపారు. పట్టణంలో ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మట్టి నమూనాల సేకరణపై శిక్షణ



శృంగరాయునిపాలెంలో మట్టి నమూనాల సేకరణపై సిబ్బందికి శిక్షణ ఇస్తున్న అధికారులు



కోటనందూరులో వ్యవసాయ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఏఓ చంద్రశేఖర్

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు రైతు భరోసా కేంద్రంలో వీఏఏలు, వీహెచ్ఏలకు భూసార పరీక్షలు, మట్టి నమూనా సేకరణపై శనివారం ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి ఎ.సద్గురుమూర్తి వ్యవసాయ సిబ్బందికి భూసార పరీక్షలపై శిక్షణ ఇచ్చారు. సమస్యాత్మక భూములను గుర్తించి సాగుకు అనుకూలంగా చేసేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

మట్టి నమూనాల సేకరణలో మెళకువలు పాటించాలి

తుని రూరల్: మట్టి నమూనాల సేకరణలో మెళకువలు పాటించాలని తుని వ్యవసాయ సహాయ సంచాలకులు సుంకర బుల్లిబాబు సూచించారు. వి.కొత్తూరులో శనివారం ఏఓ అశోక్‌కుమార్ అధ్యర్యంలో వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్ఏలకు నేల ఆరోగ్యం, మట్టి నమూనాలు సేకరణపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ బుల్లిబాబు మాట్లాడుతూ భూమి సారవంతంగా ఉన్నప్పుడే తెగుళ్లను తట్టుకుని పంటలు బాగా పండుతాయన్నారు. మొక్కల పెరుగుదలకు అవసరమైన పోషకాలు భూమిలో ఉండాలన్నారు. పోషకాల ఆవశ్యకత, భూసార పరీక్షల ప్రయోజనాలు, ఎరువుల వినియోగాన్ని వివరించారు. వీఏఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

జగ్గంపేట: రైతులు అధిక దిగుబడులు సాధించడానికి తప్పకుండా భూసార పరీక్షలు చేయించాలని పెద్దాపురం రైతు పరిశోధన కేంద్రం డీడీఏ హరి సూచించారు. మండలంలోని వ్యవసాయ సిబ్బందికి భూసార పరీక్షలపై శనివారం శిక్షణ ఇచ్చారు.

భూసార పరీక్షలపై శిక్షణ

కోటనందూరు: స్థానిక రైతు భరోసా కేంద్రం-1లో మట్టి నమూనాల సేకరణ, భూసార పరీక్షలపై వీఏఏలు, వీహెచ్ఏలకు మండల వ్యవసాయాధికారి కె.చంద్రశేఖర్ శనివారం శిక్షణ ఇచ్చారు. రైతులు తక్కువ పెట్టుబడితో మెరుగైన ఫలితాలు సాధించాలంటే తప్పకుండా భూసార పరీక్షలు చేయించాలన్నారు. అనంతరం పంట పొలంలో ప్రయోగాత్మకంగా మట్టి నమూనాల సేకరణపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఏఈఓ కేవీ శివకుమారి పాల్గొన్నారు.

కిర్లంపూడి: మండలంలోని శృంగరాయునిపాలెంలో వీఏఏ, వీహెచ్ఏలకు శనివారం భూసార పరీక్షపై శిక్షణ తరగతులు నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి జోకా అమృతా ఆధ్వర్యంలో సిబ్బందికి క్షేత్రస్థాయిలో మట్టి నమూనాల సేవరణపై అవగాహన కల్పించారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడి

ఏలేశ్వరం: భూసార పరీక్షలతో అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయ అధికారి బి.జ్యోతి అన్నారు. మండలంలోని సిరిపురంలో శనివారం భూసార పరీక్షలపై వ్యవసాయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.

ఎన్నికలు ఎప్పుడొచ్చినా మాదే విజయం

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్



శంఖవరంలో విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

శంఖవరం: ఎన్నికలు ఎప్పుడు వచ్చినా మళ్లీ తమ ప్రభుత్వం అధికారంలోకి రావడం తథ్యమని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. శంఖవరంలో శనివారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంతో ప్రజల్లో జగనన్న పాలనపై నమ్మకం రెట్టింపు అయ్యిందన్నారు. ఈ నెల 7న ప్రారంభించిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వైఎస్సార్ సీపీ నాయకులు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు వివరిస్తున్నార న్నారు. గత టీడీపీ పాలనకు, ప్రస్తుతం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు మధ్య వ్యత్యాసం వివరించారన్నారు. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి ప్రజలు మద్దతుగా నిలిచారన్నారు. ఈ నెల 7 నుంచి 14వ తేదీ వరకు నియోజకవర్గంలో 62,814 కుటుంబాలను కలిశామన్నారు. ప్రత్తిపాడు మండలంలో 19,214, ఏలేశ్వరం మండలంలో 18,524, శంఖవరం మండలం 13,514, రౌతులపూడి మండలం 11,564 ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించాలి

జగ్గంపేట: పట్టణ స్థాయికి ఎదిగిన జగ్గంపేట పంచాయతీ సమగ్రాభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని జగ్గంపేట గ్రామ ఉప సర్పంచ్, సచివాలయాల మండల కన్వీనర్ బండారు రాజా కోరారు. స్థానిక పంచాయతీ ఆవరణలో శనివారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు సహకారంతో గ్రామంలో డ్రైనేజీలు, రహదారులు, అవసరమైన చోట్ల కల్వర్టులు నిర్మిస్తున్నట్లు తెలిపారు. దశాబ్దల కాలంగా పెండింగ్‌లో ఉన్న శ్రీరామ్‌నగర్ నుంచి గోకవరం రోడ్డు వరకూ కాలవపై బ్రిడ్జి నిర్మిస్తున్నామని, దీనికి అప్రోచ్ రోడ్డు వేయడానికి మరో రూ.3 లక్షలు ఖర్చువుతోందన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం మాట్లాడుతూ గ్రామంలో దేవి షిషరీస్ ఏర్పాటు వల్ల ఉపాధి మార్గాలు పెరిగినా కాలుష్యం సమస్య అందరినీ ఇబ్బంది పెడుతోందన్నారు. కాలుష్య నివారణకు కంపెనీ ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాన్నారు. కంపెనీ సీఎస్ఆర్ ఫండ్స్‌ను జగ్గంపేట అభివృద్ధికి కేటాయించాలని కోరారు. పంచాయతీ ఈఓ గణేష్‌బాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య నివారణకు చర్యలు

ఏలేశ్వరం: పట్టణంలోని 20వ వార్డులో తాగునీటి సమస్య తలెత్తడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు నివారణ చర్యలు చేపట్టారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ మసిరపు బుజ్జి, కౌన్సిలర్ అలమండ చలమయ్య వార్డులో పర్యటించి అధికారుల సహకారంతో తాగునీటి సమస్యను పరిష్కరించారు. ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ సూచనల మేరకు ప్రస్తత వేసవిలో పట్టణంలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ఓవర్ హెడ్ ట్యాంకులు, చేతిపంపుల ద్వారా ప్రజలకు తాగునీటిని అందిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఏఈ అనూషలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు దిలబర్ హుస్సేన్, తొండారపు రాంబాబు, మసిరపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

24న పాదయాత్ర



రంపయర్రంపాలెంలో ర్యాలీ చేస్తున్న రైతుకూలీ సంఘం సభ్యుల

గోకవరం: రంపయర్రంపాలెం గ్రామంలోని సుందరమ్మ సత్రానికి చెందిన 89 ఎకరాల భూమికి సంబంధించి ఎండోమెంట్ శాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఈ నెల 24న పాదయాత్ర నిర్వహించనున్నట్టు ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు తెలిపారు. ఈ మేరకు శనివారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్రం భూముల విషయంలో భూస్వాములకు, రాజకీయ నాయకులకు ఎండోమెంట్ శాఖ అధికారులు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. దీనిపై పలుమార్లు జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదన్నారు. దీనికి నిరసనగా 24న రంపయర్రంపాలెం నుంచి గోకవరం తహశీల్దార్ కార్యాలయం వరకు నిర్వహించే పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు.

ప్రశాంతంగా ముగిసిన టెన్త్ పరీక్షలు



ఒమ్మంగిలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్జేడీ నాగమణి

గండేపల్లి: పదో తరగతి పరీక్షలు శనివారంతో ప్రశాంతంగా ముగిశాయి. మండలంలోని తాళ్లూరు, మల్లేపల్లి, గండేపల్లి మూడు పరీక్షా కేంద్రాల్లో 489 మంది విద్యార్థులకు గాను 481 మంది పరీక్షలు రాసినట్టు ఎంఈఓ కేహెచ్ నాయక్ తెలిపారు.

పగడ్బందీగా పదో తరగతి పరీక్షలు

ప్రత్తిపాడు రూరల్: పదో తరగతి పరీక్షలను విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పగడ్బందీగా నిర్వహిస్తున్నట్టు జోన్-2 స్కూల్ ఎడ్యుకేషన్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఎ.నాగమణి తెలిపారు. మండలంలోని ఒమ్మంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్ష కేంద్రాన్ని శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. జగనన్న విద్యాకానుక కిట్లను జాగ్రత్తగా భద్రపరిచి సక్రమంగా ఆయా పాఠశాలలకు పంపిణీ చేయాలని ఎంఈఓ వి.రాజబాబును ఆదేశించారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు మల్లేష్, గంగాధర్, ఉపాధ్యాయుడు రాజబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

సోషల్ స్టడీస్ పరీక్షకు 8 మంది గైర్హాజరు

ప్రత్తిపాడు: పదో తరగతి పరీక్షలు శనివారంతో ముగిశాయి. మండలంలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో చివరిరోజు జరిగిన సోషల్ స్టడీస్ పరీక్షకు ఎనిమిది మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు ఎంఈఓ వి.రాజబాబు తెలిపారు. ప్రత్తిపాడు జెడ్పీ హైస్కూల్‌లో 189 మందికి 188 మంది, ధర్మవరం జెడ్పీ హైస్కూల్‌లో168 మందికి 164 మంది, లంపకలోవ జెడ్పీ హైస్కూల్‌లో 256 మందికి 253 మంది, ఒమ్మంగి జెడ్పీ హైస్కూల్ ఎ సెంటర్‌లో 180 మంది, ఒమ్మంగి బి సెంటర్‌లో 150 మంది వెరసి 943 మందికి 935 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్టు ఆయన వివరించారు.

పదోతరగతి పరీక్షలకు ఎనిమిది మంది గైర్హాజరు

కిర్లంపూడి: మండలంలోని ఐదు పరీక్ష కేంద్రాల్లో శనివారం జరిగిన పదో తరగతి పరీక్షలకు ఎనిమిది మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు ఎంఈఓ టి.జోసెఫ్ తెలిపారు. కిర్లంపూడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 202 మందికి 200 మంది, బూరుగుపూడి జెడ్పీ హైస్కూల్లో 228 మందికి 225 మంది, తామరాడ ప్రభుత్వ హైస్కూల్లో 272 మందికి 269 మంది పరీక్షలకు హాజరైనట్లు వివరించారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తును స్థానిక ఎస్సై టి.రఘునాథరావు పర్యవేక్షించారు.